యథేచ్ఛగా ప్రభుత్వ భూమిలో నిర్మాణం

అధికారులు హెచ్చరిస్తున్నా పట్టించుకోని కబ్జాదారులు

ఆదివారం యథేచ్ఛగా ప్రభుత్వ భూమిలో ప్రహరీ చేపడుతున్న అక్రమార్కులు

శంషాబాద్ రూరల్, మార్చి 31 : కబ్జారాయుళ్లు యథేచ్ఛగా ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు హెచ్చరిస్తున్నా పట్టించుకోవడంలేదు. వివరాల్లోకి వెళ్తే.. శంషాబాద్ మండలంలోని అమ్మపల్లి రెవెన్యూ పరిధిలోని ఖారీజ్‌ఖాతా(ప్రభుత్వ భూమిని)ను కొందరు కబ్జా చేసి ప్రహారీ నిర్మాణం చేపట్టారు. స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు ఫిబ్రవరి 28న ఆ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఆదివారం సెలవు కావడంతో మళ్లీ నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది అక్కడికి వచ్చి పనులు నిలిపివేయాలని ఆదేశించినా కబ్జాదారులు మాత్రం పట్టించుకోకుండా యథేచ్ఛగా నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జారాయుళ్లపై కేసు నమోదు చేసి.. ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

బంజారాహిల్స్‌లోని షరోన్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు.. సందేశం వినిపిస్తున్న పాస్టర్ రెవరెండ్ ప్రభుదాస్

ఎల్ఈఎఫ్ చర్చిలో క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న బ్రదర్ అబ్రహం

ఘనంగా ఈస్టర్ వేడుకలు

బంజారాహిల్స్,మార్చి 31: ఏసుక్రీస్తు పునరుత్థానం చెందిన రోజు సందర్భంగా జరుపుకునే ఈస్టర్ పర్వదిన వేడుకలను ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలోని చర్చిలలో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని షరోన్ చర్చిలో వేలాదిమంది క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. షరోన్ చర్చి పాస్టర్ రెవరెండ్ ప్రభుదాస్ ప్రత్యేక సందేశాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే దానం నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణగూడలోని బాప్టిస్ట్ చర్చిలో ..

హిమాయత్‌నగర్, మార్చి 31: మానవళి మనుగడకు యేసుక్రీస్తు బోధనలు ఎంతో ఉపకరిస్తాయని బాప్టిస్ట్ చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్. జి.శామ్యూల్ అన్నారు. ఆదివారం నారాయణగూడలోని బాప్టిస్ట్ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే క్రైస్తవ సోదరులు పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పార్థనలు చేశారు. గాయకులు ఆలపించిన పలు ఆధ్యాత్మిక గీతాలు అందిరిని ఎంతగానో ఉత్తేజింపజేశాయి.

ఖైరతాబాద్‌లో..

ఖైరతాబాద్, మార్చి 31 : ఖైరతాబాద్, లక్డీకాపూల్, మారుతీనగర్‌లోని లేమెన్స్ ఎవాంజికల్ ఫెలోషిప్, లూథరన్, దమస్కస్ చర్చిలలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎల్ఈఎఫ్ చర్చిలో బ్రదర్ అబ్రహం క్రీస్తు సందేశాన్ని వినిపించారు.

ప్రమాదాల నివారణకు యూ టర్న్ మూసివేత

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 31: రోడ్డు ప్రమాదాలను నివారించాలని పలువురి విజ్ఞప్తి మేరకు రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ కిరణ్‌కుమార్ స్పందించి..వెంటనే యూటర్న్ మూసివేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, బాబుల్‌రెడ్డినగర్, మార్కండేయనగర్ ప్రాంతాల్లో రోడ్లు దాటే సమయంలో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని శనివారం నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డిల ఆధ్వర్యంలో సీఐ కిరణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు ఆదివారం ట్రాఫిక్ సీఐ ఆదేశాల మేరకు బాబుల్‌రెడ్డినగర్ వెళ్లే క్రాసింగ్ (యూటర్న్)ను మూసి వేశారు. ఈ యూటర్న్ ద్వారా వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారన్నారు. ఈ యూటర్న్ మూసి వేయడంతో ప్రమాదాల తీవ్రత చాలా వరకు తగ్గుతుందని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు అన్నారు. అదే విధంగా పాదచారుల క్రాసింగ్‌ల ఏర్పాటు, స్పీడ్ బంప్‌లు కూడా ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఈ సందర్భంగా నవయువ యూత్ క్లబ్, స్థానిక ప్రజలు ట్రాఫిక్ సీఐకు కృతజ్ఞతలు తెలిపారు.

బాబుల్‌రెడ్డినగర్ వద్ద యూ టర్న్‌ను మూసి వేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు

మణికొండ, మార్చి 31: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్రాబ్యాంక్ బస్టాప్ సర్కిల్‌లో అరుణాచల్ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రోజు రోజుకు ఎండల తీవ్రత మరింత అధికం అవుతుందన్నారు. వీటిని తట్టుకునేందుకు ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి ప్రధాన కూడళ్లు, బస్తీలు, కాలనీలు, చౌరస్తాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప, అరుణాచల్ సేవా సమితి సభ్యులు బద్రి, నాయకులు శివకుమార్, ప్రతాప్ రెడ్డి, రాములు, సంగీత, రమణ, లవకుమార్, జగదీశ్, ప్రవీణ్, వంశీ, నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

మణికొండ ఆంధ్రాబ్యాంక్ సమీపంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

దళితకవి ఇద్దాసుకు నివాళి

చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాది లో భాగంగా ఆదివారం తొలితరం దళితకవి దున్న ఇద్దాసు సంస్మరణ సభ జరిగింది. పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త ముఖ్యఅతిథిగా విచ్చేసి ఇద్దాసు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. త్యాగరాయ గాన సభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాయకుడు చింతలపూడి త్రినాథరావు, వినయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. - ముషీరాబాద్

వైభవంగా మల్లన్నస్వామి జాతర ఉత్సవాలు



మండలంలోని చౌదరిగూడ గ్రామంలోని శ్రీ మల్లన్నస్వామి జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా మల్లన్నస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో మల్కారం సహకార సంఘం చైర్మన్ బుర్కుంట సతీశ్, నాయకులు మామిళ్ల మల్లేశ్‌యాదవ్, మెండే కుమార్‌యాదవ్‌తో పాటు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. *– శంషాబాద్ రూరల్, మార్చి 31*

చౌదర్‌గూడ గ్రామానికి చెందిన మల్లేశ్‌కు మండల ప్రధాన కార్యదర్శిగా నియామకపత్రం అందజేస్తున్న మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

శంషాబాద్ రూరల్, మార్చి 31 : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులను మండల, గ్రామ కమిటీల్లో పదవులను అప్పగించారు. ఈ సందర్భంగా శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ ..కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మండల ప్రధాన కార్యదర్శిగా చౌదర్‌గూడ గ్రామానికి చెందిన పొగాకు మల్లేశ్ , కార్యదర్శిగా లింగమయ్య, సహాయ కార్యదర్శిగా ప్రభాకర్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఆత్మీయ సమావేశం

సుల్తాన్‌బజార్, మార్చి 31 : తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఆత్మీయ సమావేశాన్ని ఏప్రిల్ 1న నాంపల్లి గృహకల్ప ఆవరణలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ ఆదివారం తెలిపారు. సమావేశంలో కేంద్ర సంఘానికి ఆరోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన జ్ఞానేశ్వర్ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక సన్మానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథులుగా టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ హాజరవుతారని తెలిపారు.

అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను గెలిపించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 31 : బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మల్కాజిగిరి అభివృద్ధి కోసం రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లోని పీవీఎన్ఆర్ పార్కు, అంబేద్కర్ పార్కులో ప్రజలతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరం ఆదర్శవంతంగా అభివృద్ధి చెందిందన్నారు. నగరంలోని కాలనీలు, బస్తీలలో సమస్యలన్నింటినీ పరిష్కరించామని మెరుగైన మౌలిక వసతుల కల్పన వల్లే నగరం శరవేగంగా అభివృద్ధి సాధించిందన్నారు. గత ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించడం వల్లే ఎమ్మెల్యేగా విజయం సాధించానని మరోమారు బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నేతలు, అసోసియేషన్ నేతలు ఉన్నారు.

డీసీఎం ఢీకొని పారిశుధ్య కార్మికులకు గాయాలు

శంషాబాద్ రూరల్, మార్చి 31 : విధులకు వెళ్తున్న పారిశుధ్య కార్మికులు ప్రయాణిస్తున్న మినీ ఓమ్నికారును వెనక నుంచి వచ్చిన డీసీఎం ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శంషాబాద్‌లో జరిగింది. స్థానికులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం .... శంషాబాద్ మండలంలోని చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ గ్రామాలకు చెందిన కార్మికులు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పారిశుధ్య పనులు చేయడానికి ఆదివారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో మినీ ఓమ్ని కారు లో వస్తున్నారు. కిషన్‌గూడ వద్దకు రాగానే.. షాద్‌నగర్ వైపు నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వెనుక నుంచి కారును ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన కార్మికులు పి.నిర్మల, హంసమ్మ, డి మాధవిలను స్థానికంగా ఉన్న ఓ ప్రైయి వేటు దవాఖానకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులకు మెరుగైన వైద్యమందించాలి..

చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శిస్తున్న జైపాల్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన పారిశుధ్య కార్మికులకు మెరుగైన వైద్యమందించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. దవాఖానలో చికిత్స పొందుతున్న వారిని శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, రాజు, అశోక్‌లతో కలిసి ఆయన ప రామర్శించారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

వెంగళరావునగర్‌లో బైక్ చోరీ

వెంగళరావునగర్, మార్చి 31: పాల ప్యాకెట్లు కస్టమర్‌కు ఇచ్చి వచ్చేలోపు బైక్ చోరీకి గురైంది. ఈ సంఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..రహ్మత్‌నగర్‌కు చెందిన కె.ఉదయ్ పాల ప్యాకెట్లు సరఫరా చేస్తుంటాడు. ఆదివారం ఉదయం వెంగళరావునగర్ సాయి రెసిడెన్సీ వద్ద బైక్‌ను నిలిపి పాల ప్యాకెట్లు ఇచ్చేందుకు ఫ్లాట్ వద్దకు వెళ్లి..తిరిగొచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. చోరీకి గురైందని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

కాచిగూడ,మార్చి 31: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్ల ను విక్రయిస్తున్న వ్యక్తిపై కాచిగూడ పో లీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై డి. సుభాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానగర్‌కు చెందిన రాములు కుమారుడు పిల్లి రాజేశ్ ఇంట్లో మద్యం అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నా డు. సమాచారం అందుకున్న ఎస్సై ఘ టనా స్థలానికి చేరుకుని అతడి నుంచి 20 క్వార్టర్ బాటిళ్లు, 90 ఎంఎల్ 13 బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ,మార్చి 31: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపినవివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (35) ఆదివారం సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-3లో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి ఒంటిపై తెలుపు చొక్క, నీలి రంగు ప్యాంట్ ఉందని, ఎత్తు5.6 ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

రూ.85 కోట్లు దాటిన పన్నువసూలు

- ముగిసిన ఆస్తి పన్ను చెల్లింపు గడువు
- టార్గెట్ పూర్తి చేసిన అధికారులు



డీసీ విద్యాధర్, ఏఎంసీ శైలజకు చెక్కు అందజేస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి రాజేందర్, సంయుక్త కార్యదర్శి చంద్రజిత్ సింగ్

అబిడ్స్, మార్చి 31: ఆస్తి పన్ను చెల్లింపునకు ఆదివారం చివరిరోజు కావడంతో జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ కార్యాలయం పరిధిలో రూ. 85 కోట్లకు పైగా పన్ను వసూలైంది. ఉన్నతాధికారులు నిర్ణయించిన టార్గెట్‌ను అధికారులు పూర్తి చేయగలిగారు. సర్కిల్ కార్యాలయం పరిధిలోని పలు ప్రభుత్వ శాఖల భవనాలు, వ్యాపార, వాణిజ్య భవనాల యజమానులు పన్ను చెల్లించే విధంగా అధికారులు బృందాలుగా ఏర్పడి చర్యలు తీసుకున్నారు. డిప్యూటీ కమిషనర్ విద్యాధర్ నేతృత్వంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎంఎస్ శైలజ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు వసూలులో నిమగ్నమయ్యారు. డీసీతో పాటు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఇతర విభాగ అధికారులు కార్యాలయం పరిధిలో తిరిగి పన్ను వసూలుకు చర్యలు చేపట్టారు. వీరితో పాటు కొందరు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నిక నేపథ్యం లో బిజీగా ఉన్నా శ్రద్ధ తీసుకుని టార్గెట్ ప్రకారం వసూలు చేయడంలో సఫలీకృతులయ్యారు. ఆదివారం సెలవు దినమైనప్పటికీ అధికారులు ఒక రోజే భారీ ఎత్తున వసూలు చేయగలిగారు. ఎగ్జిబిషన్ సొసైటీకి చెందిన ఆస్తి పన్ను బకాయి 77,98,935 రూపాయల చెక్కును డీసీ విద్యాధర్, ఏఎంసీ శైలజలకు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి రాజేందర్ అందజేశారు.

జీహెచ్ఎంసీ సర్కిల్ -13లో..

మెహిదీపట్నం, మార్చి 31 : జీహెచ్ఎంసీ సర్కిల్ -13 పరిధిలోని కార్వాన్‌లో ఆదివారం ఆస్తి పన్ను మొండి బకాయిలను వసూలు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ శశిరేఖ తెలిపారు. ఆదివారం కార్వాన్ వార్డు కార్యాలయంలో పలు మొండి బకాయిలలో భాగంగా రూ.32, 20, 250 సంబంధించి చెక్, డబ్బులను తీసుకున్నామని డీసీ చెప్పారు.

ప్రార్థనలకు ఇబ్బందులు కలుగకుండా చూడండి

రంజాన్ రోజు జరుపుకునే సామూహిక ప్రార్థనల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఆదివారం ఎంపీతో సమావేశం అయ్యారు. ఇఫ్తార్‌పై చర్చించిన ఎంపీ మసీదులు, ఈద్గా మైదానాల్లో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. - మెహిదీపట్నం

భద్రతా ప్రమాణాలు పాటించాలి

మెహిదీపట్నం, మార్చి 31 : రంజాన్ మాసంలో భద్రతా ప్రమాణాలు పాటిస్తూ షాపింగ్ సౌకర్యవంతంగా చేసుకోవాలని దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మెహిదీపట్నంలోని డీసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దుకాణాల వారు వేళలను పాటిస్తూ వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. గోషామహల్, కుల్సుంపుర, ఆసిఫ్‌నగర్, గోల్కొండ ఏసీపీ డివిజన్ల పరిధిలో ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. షాపింగ్ మాల్ యాజమాన్యాలు పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు.

ఛత్రినాక పరిధిలో కార్డన్‌సెర్చ్

ఛత్రినాక పీఎస్ పరిధిలో దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యతో అదనపు డీసీపీ షేక్ జహంగీర్, ఛత్రినాక ఏసీపీ సీహెచ్ చంద్రశేఖర్, వంద మంది పోలీస్ సిబ్బందితో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా ఓ షాపులో విక్రయిస్తున్న మద్యం బాటిళ్లు, మూడు కర్టెన్ల బీర్లు స్వాధీనం చేసుకున్నారు ఆపరేషన్‌లో ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మొగల్‌పుర డీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

- చాంద్రాయణగుట్ట, మార్చి 31

గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 31: గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరాంఘర్ చౌరస్తా ఎస్ వీఎం మాల్ పక్కనగల నిర్మాణుష్య ప్రదేశంలో గుర్తు తెలియని మహిళ పడి ఉన్నట్లు ఆదివారం ఉదయం పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు అక్కడికి వెళ్లి పరిశీలించగా..అప్పటికే మృతి చెంది ఉందని, 35-40 సంవత్సరాలు ఉంటాయని, గ్రీన్ కలర్ జాకెట్, ఎరుపు, పసుపు కలర్ పూల డిజన్ గల నలపు చీర ధరించి ఉందన్నారు. ఈ మహిళ వివరాలను తెలుసుకునేందుకు స్థానికంగా వాకబు చేసినా ఎలాంటి సమాచారం లభించలేదన్నారు. దీంతో గుర్తు తెలియని మహిళా మృతదేహంగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలి వివరాలు తెలిసినవారు ఫోన్: 9490617459, 9490617267లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

స్నేహితుల మధ్య గొడవ.. ఒకరికి కత్తి పోట్లు

బండ్లగూడ,మార్చి 31: ముగ్గురు స్నేహితుల మధ్య చెలరేగిన వివాదం ఒకరికి కత్తి పోట్లకు దారి తీసింది.ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అదివారం సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని ఓ ప్లాట్‌లో టోలీచౌకి ప్రాంతానికి చెందిన సయ్యద్ ముస్తాఫ అలీ, సులేమాన్‌నగర్‌కు చెందిన అమాన్, అఫ్నాన్‌లు మద్యం సేవించారు. అనంతరం మైత్తులో గొడవ పడ్డారు. దీంతో అఫ్నాన్,అమాన్‌లు ముస్తాఫ అలీపై బీర్ బాటిల్‌తో దాడి చేసి కత్తితో చాతిలో పొడిచి పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు బాధితుడిని స్థానిక ఆస్పత్రికి తరలించి.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. పాత కక్షల నేపథ్యంలో ఈ ఘటనకు కారణం అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

దానగుణం ఉన్న మనిషిలో దైవత్వం ఉంటుంది

దాన గుణం, నిబద్ధతతో జీవించే ప్రతి మనిషిలో దైవత్వం ఉంటుందని శ్రీ రామదూత స్వామి పేర్కొన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, దాంపత్యవ్రతం, వేణు దత్తాత్రేయ అభయమా మాలధారణ, దీక్షలను భగవాన్ శ్రీ రామదూత స్వామి ప్రారంభించారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సతీ సమేతంగా పూజలు చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈటెల రాజేందర్, దాసోజు శ్రవణ్‌కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, ఎంఎన్ఆర్ గ్రూపు విద్యా సంస్థల డైరెక్టర్, పారిశ్రామిక వేత్తలు, ధార్మిక, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు తరలి రాగా వారికి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. - అబిడ్స్, మార్చి 31

మే 1 నుంచి వేసవి శిక్షణ శిబిరం

కాచిగూడ, మార్చి 31 : వేసవిలో చిన్నారులకు నృత్యం, లలిత సంగీతం, నటన, చిత్రలేఖనం అంశాల్లో నారాయణగూడ బాలనందం భవన్‌లో మే 1 నుంచి మే 31 వరకు శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు బా లనంద సంఘం అధ్యక్షురాలు జేవీ కామేశ్వరి తెలిపారు. తరగతులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు ఉంటాయని, ఆసక్తిగల వారు 040-2756 1443, www. balanandam. co.inలో వివరాలు పొందుపర్చాలన్నారు.

రూ.1.27 కోట్ల ఆస్తిపన్ను బకాయి వసూలు

మియాపూర్ , మార్చి 31 : చందానగర్ సర్కిల్ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లలో భాగంగా ప్రభుత్వరంగ ఆర్టీసీ సంస్థ నుంచి పెద్ద మొత్తంలో పన్ను బకాయి వసూలైంది. చందానగర్ సర్కిల్ మియాపూర్ డివిజన్ పరిధిలో ఆర్టీసీ బస్ బాడీతో పాటు ఆర్టీసీ డిపో 1, 2లు ఉన్నాయి. వీటి నుంచి పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను బకాయి పేరుకుపోవడంతో పన్ను విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. ఓటీఎస్ పథకం కింద పన్ను చెల్లింపు వినియోగంపై అవగాహన కల్పించారు. అధికారుల ప్రయత్నం ఫలిం చి బస్ బాడీ, రెండు డిపోల నుంచి రూ. 1,27,35,420 ల పన్ను బకాయి వసూలైంది. ఈ మేరకు పన్ను విభాగం సూపరిండెండెంట్ విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి పన్ను బకాయికి చెందిన చెక్కులను ఆర్టీసీ మియాపూర్ డిపో అధికారుల నుంచి ఆదివారం అందుకున్నారు. వసూలైన పన్ను బకాయిలో బస్ బాడీ నుంచి రూ. 96,92,388, డిపో 1 నుంచి రూ11, 12,068, డిపో 2 నుంచి రూ. 19,30, 964ల మొత్తం చెక్కుల రూపంలో అధికారులకు అందాయి.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

*వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు నృత్యకారుల ప్రదర్శనలు సందర్శక